
# ఓహో! తలాగా!



— కొమ్మిశెట్టి మోహన్

విశాలాక్షి తాను తెచ్చిన పట్టుచీర, టెరికాటన్ పంచల జత, తువ్వాళ్ళు, ఇంకా కొన్ని రవికెల గుడ్డలు, ఇరుగు పొరుగు అమ్మలక్కల సౌకర్యార్థం ప్రదర్శన ఏర్పాటుచేసింది.

వీథిలో ఏ ఒక్క ఇంట్లో కొత్త వస్తువుల దిగుమతి జరిగినా, ఇలా అందరూ చుట్టూ చేరి వాటిని గురించి తమ అభిప్రాయాలు వెలిబుచ్చడం మామూలే.


ఇప్పుడు కూడ అదే జరుగుతోంది. ఒకరు పట్టుచీర అంచును మెచ్చుకున్నారు. ఇంకొకరు అంచు బాగాలేదు కాని చీర కొంగు బాగుందన్నారు. ఇంకొకామె అన్నీ బాగానే వున్నాయి. కాని ఆ షాపువాడు ధరలో మోసం చేశాడని అంది. ఆ చీర రెండువేలా అయిదువందల కంటె ఎక్కువ చేయదనీ, మూడువేల బిల్లు వేశాడంటే కనీసం ఐదొందలు ఎక్కువని ఆమె వాదన. వారి మాటలు అలా సాగిపోతూనే వున్నాయి.

మధ్యాహ్నం రెండు గంటలకు భోజనాలు ముగించి, అన్నీ సర్దుకున్న తర్వాత మహిళలంతా అక్కడ సమావేశమయ్యారు. ఆ రోజు ఆదివారం కావడం వల్ల రాజశేఖర్ భోజనం ముగించి, అలా నడుం వాల్చి ఏదో నవల చేతిలోకి తీసుకున్నాడు. కానీ అతనికి పుస్తకం మీద ధ్యాస నిలవలేదు. బయట మహిళల మాటలన్నీ స్పష్టంగా అతనికి వినిపిస్తూనే వున్నాయి. కొత్తబట్టలను గురించి అభిప్రాయాలు వెలిబుచ్చిన తర్వాత, అందరూ ఏకగ్రీవంగా విశాలాక్షి ఔదార్యాన్నీ, అత్తమామల పట్ల ఆమెకున్న భక్తిశ్రద్ధలను, అభిమానాన్నీ మెచ్చుకుంటూ తీర్మానం ఆమోదించారు. రాజశేఖర్ నవ్వుకున్నాడు. ఆ కాలక్షేపం తీరే అంత. మనిషి ఎదుట ఎంతో గొప్పగా పొగడ్తల వర్షం కురిపిస్తారు. ముఖం చాటుగా వెళ్ళి విమర్శిస్తుంటారు. ఎదుటి మనిషితో అవసరం వున్నా లేకున్నా ఎందుకు ముఖస్తుతి చేస్తారో?

అలాగే ఒక మనిషి మీద కోపం, శత్రుభావం వున్నా లేకున్నా ఎందుకు విమర్శిస్తారో అతనికి అంతుపట్టలేదు. ఈ అమ్మలక్కలే తర్వాత చెవులు కొరుక్కుంటూ పోస్టుమార్టం చేసే డాక్టరులా విశాలాక్షిని విమర్శిస్తారు. అవును, విశాలాక్షిని విమర్శిస్తారు. అతనికి తెలుసు. రాజశేఖర్ కళ్ళ ముందు గతమంతా ఒక్కసారి కదలాడింది.

* * *

రాజశేఖర్ ఉద్యోగంలో చేరి ఐదు సంవత్సరాలైంది. మామగారి పలుకుబడి వల్ల పెళ్ళయిన రెండు నెలల్లోనే అతనికి ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో అసిస్టెంటు ఇంజనీరు ఉద్యోగం వచ్చింది. వెంటనే ఉద్యోగంలో చేరి కాపురం పెట్టాడు. ఈ అయిదేండ్లలో అమ్మా, నాన్నలను రమ్మని ఎన్నిసార్లు పిలిచినా రాలేదు. తానే అప్పుడప్పుడూ వూరికి వెళ్ళి వాళ్ళను పలకరించి వచ్చేవాడు. ఆ రోజు జానకిరామయ్య, అన్నపూర్ణమ్మ రిక్షా దిగి ఇంటిలోకి వచ్చారు. రాజశేఖరం అంతకుముందే ఆఫీసు నుంచి వచ్చాడు. కనీసం రిటైరు అయిన తర్వాత




నైనా తన తల్లిదండ్రులు ఇక్కడికి రావడం రాజశేఖరానికి చాలా సంతోషంగా వుంది.

విశాలాక్షి అత్తమామలకు సమయానికి అన్నీ సమకూరుస్తూనే వుంది. అయినా తాను ఒక పెద్ద బిజినెస్ మాగ్నట్ కూతురిననే అహం, ఒక ఇంజనీరు భార్యననే గర్వం ఆమె ప్రతి కదలికలోను కనిపించేవి. నాలుగేళ్ళ బాబిగాడు తన తాతయ్య, నాయనమ్మల దగ్గర బాగా కలసిపోయాడు. అమాయకంగా, ముద్దుగా వుండే వాడి మాటలు వింటూ వారిద్దరూ తన్మయత్వం చెందేవారు. కాని విశాలాక్షి వాణ్ణి వాళ్ళదగ్గర ఎక్కువసేపు వుండనిచ్చేది కాదు. చదువుకోమనో, మరేదో సాకుతోనో వీలున్నంతవరకు వాళ్ళకు దూరంగానే వుంచాలని ప్రయత్నించేది. జానకిరామయ్యా, అన్నపూర్ణమ్మ ఇది గమనించకపోలేదు. అయినా పెద్ద వాళ్ళు కదా! పెద్ద మనసుతో ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు.

దీపావళి పండుగ నాలుగు రోజులుండగా రాజశేఖర్ ఇంట్లో వాళ్ళందరికి కొత్త బట్టలుతెచ్చాడు. అన్నపూర్ణమ్మకు వెయ్యి రూపాయిల్లో మంచి నేత చీర తెచ్చాడు. జానకిరామయ్యకు టెరికాటన్ చొక్కా, పంచె తెచ్చాడు. ఆ రోజు రాత్రి విశాలాక్షి చిన్న సైజు యుద్ధాన్నే ప్రకటించింది. 'మీ అమ్మా, నాన్నా పడుచు వాళ్ళనుకున్నారా? ఇంట్లో వుండేవారే కదా! అంత డబ్బుతగలేసి బట్టలు తీసుకురాకపోతే ఏవో మామూలు బట్టలుతెస్తే సరిపోయేది కదా? వాళ్ళ ధోరణి చూస్తే ఇప్పుడే వూరికి వెళ్ళేటట్లు లేరు. బాబిగాడి నెపంతో ఇక్కడే మకాం వేసేట్టుగా వుంది"

"వాళ్ళు రాక రాక మన ఇంటికి వచ్చారు. మనకు మాత్రం మంచి బట్టలు తెచ్చుకుని వాళ్ళకు అలా తెస్తే ఏం బాగుంటుంది" రాజశేఖర్ భార్యతో అనునయంగా అన్నాడు. అయినా విశాలాక్షి రాత్రంతా నిష్ఠూరాలాడుతూ, తన మాటకు విలువలేదని మూలుగుతూ ఏడుస్తూనే వుంది.

తెల్లవారే కొత్తబట్టలు చూసిన జానకిరామయ్య, అన్నపూర్ణమ్మ అంత ఖరీదైనవి ఎందుకు తెచ్చావని కొడుకును మందలించారు. ఎప్పుడూ లేనిది ఇప్పుడింత ఖరీదైనవి కట్టుకోవడం తమకు అదోలా వుంటుందని, తెచ్చినవాటిని సున్నితంగానే తిరస్కరించారు. ఖద్దరు చొక్కా, నేత పంచ, రెండు మూడు వందల్లో నేత చీర తెమ్మని చెప్పారు.

రాత్రి విశాలాక్షి చేసిన రభసంతా పొరబాటున వీళ్ళు వినలేదు కదా! అని రాజశేఖరానికి అనుమానమొచ్చింది. అతను తక్కున అమ్మా నాన్నల ముఖాల్లోకి చూశాడు. వారి ముఖాలు ప్రసన్నంగా, ప్రశాంతంగా వున్నాయి. అతను ఏ భావమూ చదవలేకపోయాడు. రాజశేఖరం ఆరోజే మళ్ళీ బట్టలు మార్చి తెచ్చాడు. అతనికి విశాలాక్షి మీద చెప్పలేనంత కోపమొచ్చింది. కాని అమ్మా, నాన్నల ఎదుట ఇంకా రభస చెయ్యడం, అదీ వాళ్ళ విషయంగానే తామిద్దరూ పోట్లాడుకోవడం వల్ల వారు కూడా బాధపడడం తప్ప ప్రయోజనం వుండదని అతనికి తెలుసు. అందుకే విశాలాక్షినేమీ అనలేక తన చేతకానితనానికి మనసులోనే సిగ్గుపడ్డాడు. తనను పెంచి, పెద్ద చేసిన తల్లిదండ్రులకు మంచి బట్టలుకూడా తెచ్చి ఇవ్వలేని తన దౌర్భాగ్యానికి ఎంతో బాధపడ్డాడు.

ముగ్గురు ఆడపిల్లలు తర్వాత జానకిరామయ్య దంపతులకు రాజశేఖరమొక్కడే కొడుకు. అందుకే వారు అతన్ని శక్తి వున్నంతలో ఎంతో మురిపెంగా పెంచారు. అలాగని కూతుళ్ళకు తక్కువ చెయ్యలేదు. జానకిరామయ్య ఒక మామూలు ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయునిగా వుంటూనే నలుగురు పిల్లల్నీ తీర్చి దిద్దారు. ముగ్గురు కూతుళ్ళను టీచర్ ట్రెయినింగులు చదివించి, వున్నంతలో కట్నం ఇచ్చి, టీచర్లనే తెచ్చి వివాహాలు జరిపించారు. ఇప్పుడు వారి బ్రతుకులు సాఫీగా జరిగిపోతున్నాయి. రాజశేఖరాన్ని ఎంతో కష్టపడి ఇంజనీరింగు చదివించారు. ఆడపిల్లల పెండ్లిండ్లకు, అతని చదువులకు వున్న నాలుగెకరాల పొలాన్ని అమ్మేశారు. అన్నపూర్ణమ్మ కూడా ఎంతో పొదుపుగా సంసారం నడిపేది. తన స్వంతానికి ఏదీ కావాలని తొందరపెట్టేది కాదు. ఏదైనా ముందు పిల్లలకు పెట్టిన తర్వాతే మిగిలింది తినేది. మిగలకపోయినా తిన్నంత తృప్తిపడేది.

రాజశేఖరానికి ఇంకా తన చిన్నతనపు రోజులు గుర్తున్నాయి. పండగ వచ్చిందంటే తను కొత్త బట్టల కోసం మారాం చేసేవాడు. నాన్న వున్నంతలో అక్కయ్యలకీ, తనకీ కొత్తబట్టలు తెచ్చేవాడు. నాన్నను కొత్త బట్టలు తెచ్చుకోమని అమ్మ బలవంతపెట్టేది. "చూడండి, మీ చొక్కాలన్నీ పాతబడిపోయాయి. 'చొక్కా చిరిగింది కొంచెం కుట్టి పెట్టు' అని నన్నడగొద్దు. నేను కుట్టిపెట్టను. కావాలంటే కొత్తవి తెచ్చుకోండి" అని అమ్మ నాన్నను మందలించేది. అలాగైనా నాన్న తనకు కొత్త బట్టలు తెచ్చుకుంటాడని ఆమె ఆశ. నాన్న మాత్రం అమ్మకు చీరలు తెస్తాననేవాడు. అమ్మ ససేమిరా వద్దనేది. "ఇప్పుడు నాకేం తొందరవచ్చింది. నేనెక్కడికి వెళ్ళాలి. ఇంటిలోనేగా వుండేది. ఇప్పుడేమీ వద్దు. ఆ డబ్బు వుంటే పిల్లల ఖర్చులకు ఉపయోగపడుతుంది." అని సర్దిచెప్పేది. మొత్తం మీద ఏదో ఒక సాకుతో ఇద్దరూ తెచ్చుకునేవారు కాదు. "మనకేం తొందర. పండుగ పూట పిల్లలకు కొత్తబట్టలుకొన్నాము. చూడు వాళ్ళ ముఖాల్లో ఎంత సంతోషం కనిపిస్తోందో, అంతకంటె మనకేం కావాలి" అని ఇద్దరూ

తృప్తిగా రాజీకొచ్చేవారు. ఇవన్నీ రాజశేఖరం జ్ఞాపకాల పొరల్లో ఇప్పటికీ దాగి వున్నాయి.

* * *

"ఏమండీ! కాఫీ తీసుకోండి" అన్న విశాలాక్షి పిలుపుతో జ్ఞాపకాల వలయంలో నుంచి ఠక్కున బయటపడ్డాడు రాజశేఖర్. ఎదురుగా గోడమీది గడియారంలో నాలుగున్నర కావస్తోంది. అప్పుడే నాలుగున్నర అయిందా? మహిళా సమావేశం ముగించి విశాలాక్షి అప్పుడే కాఫీతో వచ్చిందా? అని రాజశేఖర్ ఆశ్చర్యపడ్డాడు. కాఫీ కప్పు అందుకుంటూ ఆమె కళ్ళలోకి చూశాడు. నిజంగా పేరుకు తగ్గట్టుగానే ఆమెవి విశాలమైన, అందమైన కండ్లే. సార్థక నామధేయ. కాని ఆమె మనసే విశాలం కాదు' అనుకున్నాడు.

"ఏమిటి? అలా కొత్తగా చూస్తున్నారు?" విశాలాక్షి అడిగింది.

రాజశేఖర్ తొట్రుపడుతూ "అబ్బే! ఏమీ లేదు" అన్నాడు. విశాలాక్షి వంట గదిలోకి వెళ్ళిపోయింది. రాజశేఖర్ మళ్ళీ గతంలోకి వెళ్ళిపోయాడు.

* * *

దీపావళి పండుగ అయిపోయిన మరుసటి రోజే జానకిరామయ్య, అన్నపూర్ణమ్మ వూరికి బయలుదేరారు. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత అక్కడ మాత్రం ఏం చేస్తారని రాజశేఖర్ వాళ్ళని ఇక్కడే వుండిపొమ్మన్నాడు. వాళ్ళు ఎటూ వుండేటట్లు లేరని దృఢపరచుకున్న తర్వాత విశాలాక్షి కూడా అత్తమామలను వుండిపొమ్మని బలవంతపెట్టింది. కాని వారు కొడుకు, కోడలి అభ్యర్థనను సున్నితంగానే త్రోసిపుచ్చారు. మొదటి నుంచి అలవాటు పడిన గ్రామంలోనే తనకు తోస్తుందనీ, అదీగాక వూరి నుండి టూరిస్టు బస్సు పదిరోజుల పాటు తీర్థయాత్రలకు బయలుదేరుతుందని; తాము కూడా యాత్రలకు పోయి వస్తామని చెప్పారు. యాత్ర నుంచి వచ్చిన తర్వాత మళ్ళీ ఒకసారి వస్తామని వచ్చిచెప్పి బయలుదేరారు. కానీ తర్వాతే వూహించని ఘోరం జరిగిపోయింది. తీర్థయాత్రలకు బయలుదేరిన తన తల్లిదండ్రులకు అదే అంతిమ యాత్ర అవుతుందని రాజశేఖర్ ఊహించలేదు. టూరిస్టు బస్సు యాక్సిడెంట్‌లో ఇద్దరూ చనిపోయారు. రాజశేఖర్ షాక్ తిన్నాడు. బరువు గుండెతో జరుగవలసిన కార్యక్రమమంతా జరిపించాడు.

* * *

ఆరోజే మహాలయ అమావాస్య. పెద్దల పండుగ. మరణించిన పెద్దలకు కొత్తబట్టలు పెట్టుకొని తమను దీవించమని ప్రార్థించే పండుగ. విశాలాక్షి హడావిడి చేస్తోంది. జానకిరామయ్య, అన్నపూర్ణమ్మలు చనిపోయిన తర్వాత మొదటిసారిగా ఈ పండుగ వచ్చింది. విశాలాక్షి తాను తెచ్చిన కొత్త పట్టుచీర, టెరీకాటన్ పంచల జత దేవుని ముందు పెట్టి పూజ చేసింది. అంతా సవ్యంగా జరిగినట్టు తృప్తి పడింది. రాజశేఖరానికి తన భార్య ధోరణి వింతగా వుంది. ఒక మనిషిగాని, వస్తువుగాని అందుబాటులో వున్నప్పుడు విలువను గుర్తించలేము. దూరమైనపుడే విలువలు తెలిసొస్తాయి. అత్తమామల పట్ల ఈ భక్తిశ్రద్ధలు విశాలాక్షి పశ్చాత్తాపానికి నిదర్శనమా? లేక వారు పగ సాధిస్తారేమోనని భయమా? పిరికితనమా? లేక బయటి ప్రపంచానికి వారి పట్ల తన అభిమానం, ఆప్యాయతా చాటుకోవడానికా? రాజశేఖర్ ఆలోచనలో పడ్డాడు.

బాబిగాడు ఆ రోజు ఇంట్లో జరుగుతున్న హడావిడంతా గమనిస్తూనే వున్నాడు. వాని చిన్నారి మనసులో ఎన్నో సందేహాలు. 'అమ్మా! కొత్తబట్టలు దేవుని దగ్గర వుంచాం గదా! అవి దేవుడు కట్టుకుంటాడా?"

విశాలాక్షి మురిపెంగా కొడుకు తల నిమురుతూ అంది– "లేదు బాబూ! అవి మీ తాతయ్యకీ, నాయనమ్మకీ."

బాబిగాడి సందేహం తీరలేదు. "తాతయ్యా, నాయనమ్మా లేరుగా! మరి వారెలా తీసుకుంటారు?"

"వారు తీసుకెళ్ళరు బాబూ! వారు దేవుని దగ్గరికి వెళ్ళిపోయారు గదా! మనం వారికి బట్టలు పెట్టి పూజించితే చాలా సంతోషిస్తారు. మనల్ని ఆశీర్వదించి, బాగా చూడమని దేవునికి చెబుతారు. తర్వాత ఈ బట్టలు మనమే కట్టుకోవచ్చు."

అమ్మ మాటలు విన్న చిన్నారి బాబిగాడు అసలు రహస్యాన్ని ఛేదించినవాడిలా కండ్లు తిప్పుతూ అన్నాడు "ఓహో! అలాగా!"

అక్కడే వుండి అమ్మా, కొడుకుల సంభాషణ వింటున్న రాజశేఖర్ ముఖం ఒక్కసారిగా ప్రసన్నమైంది. తను చేయలేని పనిని, తన చిన్నారి కొడుకు సాధించాడన్నట్లు మెచ్చుకోలుగా వాని భుజం తట్టాడు.

విశాలాక్షి కొరడా దెబ్బతిన్నదానిలా ఉలిక్కి పడింది. 'వేలెడంత లేదు, వీడు నన్నే ఆట పట్టిస్తాడా?' అన్న ఉక్రోషంతో ఆమె విశాల నేత్రాలు ఎర్రగా మారాయి.

తండ్రి ప్రసన్నవదనం, తల్లి ఉగ్రరూపం, ఈ ద్వంద్వ వైఖరుల భావమేమిటో బోధపడక అమాయకంగా నిలబడ్డాడు వాడు. అయినా ఈ గొడవంతా నాకెందుకులే అన్నట్టు అక్కడి నుంచి చల్లగా జారుకున్నాడు.

## "ముద్దే దివ్య ఔషధం"

★ 'ముద్దు' మీద చాలామందికి భిన్న అభిప్రాయాలు వున్నాయి. 'ముద్దు' సర్వానందాళికి మూలకారణం అని జర్మన్ సైంటిస్టులు అంటున్నారు. 'ఫ్యూయర్ సీ' అనే జర్మన్ పత్రికలో సెక్స్ సైంటిస్ట్ ఎర్నెస్ట్ బోర్న్‌మెన్ 'ముద్దు' నిరాశను, నీరసాన్ని, తలనెప్పిని పోగొడుతుందని, తలనొప్పికి 'ఏస్ప్రిన్', 'ఏనాసిన్' వాడడం కన్నా 'ముద్దు'ని వాడండని ఆయనన్నాడట. శరీరం, మనసు, అవయవాలు ఉత్తేజం పొందాలంటే ముద్దే దివ్య ఔషధం అని అంటున్నాడాయన. ('మెట్రోపాలిటన్' సౌజన్యంతో)

ఎస్. శిల్ప

